క్లుప్తంగా

ఇరుముడితో దుర్గమ్మ సన్నిధికి


ఇరుముడులతో భవానీ మాలధారులు

మద్దికెర : బెజవాడ కనకదుర్గమ్మ అమ్మవారి మాల ధరించిన భవానీ మాలధారులు ఇరుముడులతో ఆదివారం అమ్మవారి చెంతకు బయలుదేరారు. ముందుగా స్థానిక మద్దమాంబ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వాములు మాలధారులకు ఇరుముడులు కట్టారు. ఇరుముడులు తలపై ధరించి అమ్మవారి చెంతకు బయలుదేరి వెళ్లారు. దీక్షపరులకు బంధువులు, స్నేహితులు తరలివచ్చి ఊరేగింపుగా వీడ్కోలు పలికారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో కొలువుదీరిన శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో తూర్పు రాజగోపురం నిర్మాణానికి అవసరమైన స్థలం కొనుగోలుకు ఎమ్మిగనూరుకు చెందిన మాదంశెట్టి మురళీకృష్ణ కుమారుడు శ్రీకాంత్ గుప్త రూ.21 వేలు, ఉల్లిందకొండకు చెందిన కదిరి సూర్యసేనరెడ్డి రూ.25 వేలు విరాళాన్ని కార్యనిర్వహణాధికారి వీరయ్యకు ఆదివారం అందజేశారు.

రేపటి నుంచి ఉరుసు

మద్దికెర : మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో కొలువైన కోర్కెలు తీర్చే కాశీం తాత ఉరుసు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 24న గంధం, 25న ఉరుసు సందర్భంగా స్వామి వారి షంషీర్‌ను గ్రామంలో ఊరేగిస్తామని, 26న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ప్రత్యేక పూజలు

మద్దికెర : స్థానిక మద్దమాంబ దేవాలయంలో అమ్మవారికి ధనుర్మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అభిషేకం, అష్టోత్తరనామార్చన అనంతరం నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. పూజలకు విచ్చేసిన భక్తులకు ప్రసాదం అందజేశారు.

హొళగుంద: దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు.

ప్రార్థనల వేదిక


తుగ్గలిలోని సీఎస్ఐ చర్చి

తుగ్గలి : మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి 50 ఏళ్లకు పైగా ప్రార్థనలకు వేదికగా నిలిచింది. 1950లో ఈ చర్చి నిర్మించారు. 2001లో పునర్నిర్మాణం చేపట్టారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 24వ తేదీ సాయంత్రం నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. 25న ఇక్కడ నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలకు పట్టణ క్రైస్తవులు భారీగా తరలివస్తారు.

చరిత్ర పుటల్లో రామదుర్గం చర్చి



చిప్పగిరి/ఆలూరు: పురాతన చర్చిగా మండలంలోని రామదుర్గం చర్చికి పేరుంది. 1830లో నిర్మించిన ఈ చర్చి 194 సంవత్సరాలైనా చెక్కు చెదరకపోవడం విశేషం. బ్రిటీష్ పాలనలో ఫాదర్ వెల్మోలిన్ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మాణం పూర్తి చేశారు. ఏటా జరిగే క్రిస్మస్ వేడుకలకు వివిధ దేశాల నుంచి క్రైస్తవులు వచ్చి ప్రార్థనలు చేస్తుండటం ఇక్కడి ప్రత్యేకత అని గ్రామస్తులు తెలిపారు.

వాల్మీకులంతా సంఘటితమవ్వాలి



మాట్లాడుతున్న కప్పట్రాళ్ల బొజ్జమ్మ

తుగ్గలి: ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ సాధనకు వాల్మీకులంతా సంఘటితం కావాలని వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మారెళ్లలో బోయ వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంజి అధ్యక్షతన వాల్మీకి గర్జన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 2029లోపు రిజర్వేషన్లు సాధించుకోవాలన్నారు. అనంతరం బీవీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మద్దిలేటి, సంఘం నేతలు కుబేరస్వామి, గుడిసె కృష్ణమ్మ, వలసల రామకృష్ణ, రామచంద్ర నాయుడు, రాంభీం నాయుడు, లక్ష్మీనారాయణ, తలారి పరుశురాముడు, సోమన్న, మల్లికార్జున, తిరుపాల్‌నాయుడు తదితరులు మాట్లాడారు. అనంతరం ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన చందోలికి చెందిన ముగ్గురు బాలికల కోసం రూ.9 లక్షలు సేకరించిన సంఘం నాయకులను అభినందించారు. స్థానిక నాయకులు దేవరింటి వెంకట రాముడు, ఘనమద్దిలేటి, మధుసూదన నాయుడు, రాముడు పాల్గొన్నారు.

సాగు చేయలేమన్నా!



ఈ రైతు పేరు నాగరాజు, గూళ్యం గ్రామం. ఇతను నాలు గు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాడు. 'పంట సాగుకు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు ఖర్చయ్యింది. వారం రోజుల నుంచి ఆకు ముడత తెగులు సోకింది. వారం వారం వేలు ఖర్చు పెట్టి పురుగుల మందు పిచికారీ చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. మొక్క పూత దశలో ఉంది. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే.. పెట్టుబడి కూడా దక్కేలా లేదు. మార్కెట్‌లో ధర కూడా అటికాడికే ఉంది. గతేడాది ఉన్న ధర ఇప్పుడెందుకు లేదో ప్రభుత్వమే చెప్పాలి. ఏటా తెగుళ్లు, ధరల కారణంగా నష్టపోతున్నాం. ఇలాగైతే పంటలు ఎలా సాగు చేయగల'మంటూ నిస్సహాయత వ్యక్తం చేశాడు.



శనగ పొలంలో దిగాలుగా కూర్చున్న ఈయన పేరు సంజీవనాయుడు, హత్తిబెళగల్‌కు చెందిన రైతు. నాలుగు ఎకరాల్లో రబీలో రూ.2లక్షలు ఖర్చు చేసి శనగ పంట సాగు చేశాడు. 'ఇటీవల కురిసిన వర్షాలకు పైరుకు ఎర్రతెగులు సోకింది. 2 ఎకరాల్లో పంట పసుపు పచ్చగా మారి కాయ డొల్లగా మారింది. మొదట మేర స్తాల్ల వద్ద తెగులు ప్రారంభమై.. 50 శాతం పైరుకు విస్తరించింది. ఈ ఏడాది శనగ ధర రూ.6 వేలు ఉంది. దిగుబడి వచ్చినా లాభం రాదు. ఏటా నష్టపోతూనే ఉన్నాం. అందుకే ఈ ప్రాంతంలోని చాలా మంది రైతులు వ్యవసాయం చేయలేక వలసపోతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మేమైనా ఎన్నాళ్లని నష్టాలతో పంటలు వేయగలం'. ఇప్పటికే అప్పులు పెరిగిపోయాయని ఆయన వాపోయాడు.



ధర లేక పంటను పొలంలోనే వదిలేశానని చెబుతున్న హొళగుందకు చెందిన ఈ రైతు పేరు హొన్నూర్ సాబ్. 'నాకు ఉన్న మూడు ఎకరాల్లో రూ.5 లక్షలు ఖర్చు చేసి మిరప పంట వేశా. ఎండు తెగులు సోకడంతో క్రమం తప్పకుండా పంటకు మందులు పిచికారీ చేసినా లాభం లేకపోయింది. గతేడాది క్వింటా రూ.40వేలు ధర పలకడంతో ఈ ఏడాది ఆశతో సాగు చేస్తే ప్రస్తుతం క్వింటా రూ.10వేల లోపు ఉంది. ఈ ధరకు విక్రయిస్తే కోత కూలీలు, పంట పెట్టుబడి, లారీ బాడుగకు కూడా సరిపోదు. అందుకనే కోతకొచ్చిన పంటను అలాగే పొలంలోనే వదిలేశా. ధర ఇంత పడిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తుంది. ఇలాగైతే వ్యవసాయం చేయడానికి మనసెలా వస్తుంది. మాక్కూడా కుటుంబాలున్నాయి కదా. నష్టపోతామని తెలిసి మళ్లీ మళ్లీ అటువైపే వెళ్తే సంసారం ఇబ్బందులవుతుంది'. ధరలు తగ్గకుండా చూడాలని కోరాడు.



ఏముంది సార్.. రైతన్న రాజు, దేవుడు అంటున్నారు కానీ.. ఎవరు ఆదుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్న ఈ రైతు పేరు వీరభద్రి, గోనేహాల్ గ్రామస్తుడు. 'రెండు నెలల కిందట 3 ఎకరాల్లో శనగ, 2 ఎకరాల్లో జొన్నలు విత్తాం. వారం కిందటి వరకు పైర్లు బాగున్నాయనుకున్నా. ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి శనగ పూత రాలిపోయింది. ఇంకేం పండుతుంది. ఇక జొన్న పంట కోత దశలో ఉండగా ఇటీవల కురిసిన వర్షం, పొగమంచుతో కంకులు నల్లగా మారిపోతున్నాయి. జొన్నలకు మార్కెట్‌లో క్వింటా ధర రూ.3 వేలకు మించి లేదు. అంత కష్టపడి పండిస్తే వానలు దెబ్బతీసి, ధర లేకపోయి.. సర్కారోళ్లు ఆదుకోకపోయిరి. ఎట్ల పంటలు పండిచాలో నాకైతే అర్థం కావడం లేద'ని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇటీవల ఓ కోచింగ్ సెంటర్‌లో అభ్యర్థుల్లో ప్రేరణ పెంపొందించే క్రమంలో మోటివేషనల్ స్పీకర్ వారికో ఉదాహరణ ఇచ్చాడు. అదేంటంటే.. ఒకటి, రెండు లేదా మూడుసార్లు ప్రయత్నించి ఉద్యోగం రాలేదని నిరుత్సాహంతో మరో రంగం, లేదా మరో కోర్సుకు మళ్లడం సరికాదు. ఏదైనా పోరాటం ప్రారంభిస్తే సాధించే వరకు వదలరాదు అని చెబుతూ.. ఏటా పంటల సాగులో నష్టాలు వస్తున్నా.. తన జీవితకాలం రైతన్న పంటలు వేస్తూనే ఉంటారని, మన లాగా అతను కాడి వదిలేస్తే వ్యవస్థలో ఆకలి కేకలు ప్రబలుతాయని వివరించారు. ఇందులో రైతన్న పట్టుదల, అతని ప్రయత్నం, మనోనిబ్బరం, సాగుపై మమకారం, దేశ ప్రగతికి ఉపయోగం లాంటివి వివరించాడు. అయితే ఇంత ప్రాముఖ్యమున్న అన్నదాతను ఆదుకోకుండా నేటి పాలకులు విస్మరిస్తుండటం విచారకరం.

ఏటా ఖరీఫ్‌తో వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతుంది. తొలి బోణీ బాగుండాలని వ్యాపారులు ఎలా అభిలషిస్తారో అలాగే రైతన్న కూడా తొలి పంట లాభాల బాట పట్టించాలని కోరుకుంటారు. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో అన్నదాతల ఆశలు పండలేదు. సాగు చేసినప్పటి నుంచి తీవ్ర వర్షాభావం వేధించింది. ఆ వెంటనే భారీ వర్షాలు ముంచెత్తాయి. వెనువెంటనే తెగుళ్లు చుట్టుముట్టి దిగుబడి, పంటలు కోల్పోయి భారీగా నష్టాలు చవిచూశారు. రబీలోనైనా తమ అదృష్టం పండకపోతుందా అని మళ్లీ రెండో పంటకు పూనుకున్నారు. తొలుత వర్షాలు ఊరించినా ఆ తరువాత చినుకు జాడ కరువైంది. దీంతో పైర్ల ఎదుగుదల లోపించి, చీడపీడలు వెంటాడటంతో పంటలు ఎండిపోయి పెట్టుబడి నేలపాలైంది. ఏది ఏమైతేనేమి శ్రీక్రోధి నామ సంవత్సరం సాగుకు కలిసిరాలేదు.

- ఖరీఫ్‌లో అనావృష్టి, అతివృష్టితో భారీగా పంట నష్టం
- రబీలో 22 వేల హెక్టార్లలో శనగ, 15 వేల హెక్టార్లలో మిరప,12 వేల హెక్టార్లలో కంది పంటలు సాగు
- తెగులు సోకి 30 శాతం పంట దిగుబడి రాని పరిస్థితి
- లభించని మద్దతు ధర
- కూటమి ప్రభుత్వం నుంచి కొరవడిన సాయం
- ఇలాగైతే వ్యవసాయం కష్టమేనంటున్న అన్నదాతలు

ఆలూరు రూరల్ : ఈ ఏడాది ఖరీఫ్‌లో తొలకరి వర్షాలు ఊరించడంతో అరకొరగా కురిసిన వర్షాలకు రైతులు ముందస్తుగా పంటలు సాగు చేశారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో తీవ్ర వర్షాభావం నెలకొంది. దీంతో సగానికి పైగా రైతులు విత్తనాలు వేయలేకపోయారు. మూడు నెలలు గడిచిన తరువాత భారీ వర్షాలు కురిశాయి. దీంతో పొలాల్లో నీరు నిలిచిపోయి పంటలు కుళ్లిపోయాయి. ఇక మిగిలిన పంటలకు తెగుళ్లు చుట్టుముట్టడంతో దిగుబడులు పడిపోయి అన్నదాతలు నష్టాల్లో మునిగారు. కొద్ది రోజుల తరువాత రబీలో భాగంగా రెండో పంటగా శనగ, మిరప, కంది, జొన్న తదితర పంటలు సాగు చేశారు. అయితే ఆయా పంటలను తెగుళ్లు వేధిస్తున్నాయి. అలాగే వర్షాభావం కారణంగా శనగ పంట ఎదుగుదల లోపించి పూర్తిగా ఎండిపోతోంది. రబీనైనా ఆదుకుంటుందేమోననుకుంటే ఇప్పుడు కూడా పెట్టుబడులు నేలపాలయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం సాయం చేయక, మరోవైపు ప్రకృతి ప్రకోపానికి తమకు ఆదరణ కరువైందని, ఇలాగైతే సాగు చేయలేమని వాపోతున్నారు.

నియోజకవర్గంలో..

ఖరీఫ్ ఆరంభంలో అనావృష్టి, ముగింపులో అతివృష్టితో నియోజకవర్గంలో 46 వేల హెక్టార్లలో సాగైన పత్తి పంట రూ.కోట్లలో నష్టాన్ని మిగిల్చింది. ఈ ఏడాది రబీలో శనగ సాధారణ సాగు 36 వేల హెక్టార్లు కాగా 22 వేల హెక్టార్లో సాగైంది. 17వేల హెక్టార్లలో మిరప, కంది సాధారణ సాగు 1,800 హెక్టార్లు కాగా అత్యధికంగా 12 వేల హెక్టార్లలో కంది పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

శాపంగా మారిన తెగుళ్లు..

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఈ ఏడాది రబీ సీజన్‌లో ప్రధాన పంటలైన పప్పుశనగ, మిరప, కంది తోపాటు వివిధ రకాల పంటలను 50 వేల హెక్టార్లలో సాగు చేశారు. రెండు నెలల క్రితం సాగు చేసిన పప్పుశనగకు ఎర్ర తెగులు సోకి కాయ దశలో మొక్కలు ఎండిపోతున్నాయి. 10 వేల హెక్టార్లకు పైగా ఈ తెగులు సోకడంతో శనగ పొలాలంతా పసుపు పచ్చగా మారిపోతున్నాయి. నెల క్రితం సాగు చేసిన పైర్ల భూమిలో తేమ శాతం లేక మొక్క ఎదుగుదల లేకుండా పోయింది. మిగిలిన పంటకు ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి పూత రాలిపోయిందని రైతులు వాపోతున్నారు. నియోజకవర్గంలో రైతులు ఈ ఏడాది 15 వేల హెక్టార్లకు పైగా మిరప పంట సాగు చేశారు. 60 శాతం పంటకు బూడిద తెగులు, ఎండు తెగులు, మచ్చ రోగం సోకింది. దీంతో పంట దిగుబడి 30 శాతం కూడా చేతికందేలా లేదని అన్నదాతలు పేర్కొంటున్నారు. కంది పంట 50 శాతం కోతలు పూర్తయ్యాయి. మిగిలిన పంట కోత దశలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాయ నల్లగా మారింది.


ఆదివారం కురిసిన వర్షానికి పూత రాలిపోయిన పప్పుశనగ పైరు


నల్లగా మారిన కంది పైరు


మిరపలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న బనవాసి శాస్త్రవేత్త

అంతంత మాత్రంగానే పంట దిగుబడి, మద్దతు ధర..

ఈ ఏడాది పండించిన పంటలకు మద్దుత ధర అంతం మాత్రంగా ఉండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 48 వేల హెక్టార్లలో పత్తి సాగు కాగా.. 20 వేల హెక్టార్ల పత్తి మాత్రమే చేతికందింది. క్వింటా పత్తి ధర రూ.7 నుంచి రూ.8 వేల దాకా పలికింది. పప్పుశనగ క్వింటా రూ.6 వేలు, కంది రూ.7 వేలు, మిరప ధర గత ఏడాది రూ.40 వేలు పలుకగా.. ఈ ఏడాది అమాంతంగా పడిపోయి మంచి రకం క్వింటా రూ.11 వేలు మాత్రమే లభిస్తుండటంతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం పప్పుశనగ ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు, కంది ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్లు, మిరప ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు దిగుబడి వస్తుంది.

పంట	సాగైన విస్తీర్ణం	ఎకరాకు పెట్టుబడి	మొత్తం ఖర్చు	దిగుబడి ఎకరాకు	మార్కెట్ ధర	నష్టం అంచనా
పప్పుశనగ	55 వేల ఎకరాలు	రూ.40వేలు	రూ.220 కోట్లు	3 క్వింటాళ్లు	రూ.6 వేలు	రూ.120 కోట్లకు పైగా
మిరప	35 వేల ఎకరాలు	రూ.1 లక్ష	రూ.300 కోట్లు	2 క్వింటాల్లోపు	రూ.11 వేలు	రూ.300 కోట్లకు పైగా
కంది	12 వేల ఎకరాలు	రూ.15 వేలు	రూ.14.40 కోట్లు	3 క్వింటాళ్లు (వస్తున్నాయి)	రూ.7 వేలు	కోతలు పూర్తికాలేదు

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడి పూజ


హొళగుందలో అయ్యప్పస్వామికి పడిపూజ నిర్వహించిన దృశ్యం


గజ్జహళ్లిలో శబరిమలకు వెళ్తున్న మాలధారులను సాగనంపుతున్న బంధువులు

హొళగుంద: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వామి వారి మూలమూర్తికి అభిషేకాలు, మహామంగళారతి ఇతర ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి మెట్లు, దీపాలు, పూలు, పండ్లతో చేసిన అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మాలధారులు, గ్రామస్తులకు అన్నదానం చేశారు. అలాగే మండలంలోని గజ్జహళ్లి గ్రామం నుంచి ఆదివారం 20 మాలధారులు ఇరుముడులు స్వీకరించి శబరిమలకు తరలివెళ్లారు. వారికి స్నేహితులు, బంధువులు ఊరేగింపుగా సాగనంపారు.

చౌక దుకాణ డీలర్ల నియామకానికి చర్యలు

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ డివిజన్ పరిధిలో హేతుబద్ధీకరణ ద్వారా కొత్తగా ఏర్పడిన, వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న 45 చౌకదుకాణల డీలర్ల నియామకానికి చర్యలు చేపట్టినట్లు ఆర్డీవో భరత్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి సోమవారం నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలూరు మండలంలో 13, ఆస్పరి 3, దేవనకొండ 4, హాలహర్వి 5, కృష్ణగిరి 2, మద్దికెర 2, పత్తికొండ 12, తుగ్గలి మండలంలో 4 చౌకదుకాణాలకు డీలర్లు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. డీలర్ల ఎంపికకు సంబంధించి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్ నిబంధనల మేరకు దరాఖాస్తులను ఆర్డీవో కార్యాలయంలో నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ ఈనెల 30వ తేదీలోపు అందజేయాలని సూచించారు. దరఖాస్తులు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. అభ్యర్థులకు 2025 జనవరి 5న రాత పరీక్ష, 6న ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించారు.

నూతన మసీదు ప్రారంభోత్సవం


నార్లాపురంలో ప్రసంగిస్తున్న మత పెద్దలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని నార్లాపురం గ్రామంలో ఆదివారం మస్జిదే సలఫియ్యా అహ్లె హదీస్ అనే నూతన మసీదును ముస్లిం పెద్దలు, ఆధ్యాత్మిక వేత్తలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫజీలతుష్ షేక్ అబ్దుర్ రెహ్మాన్ ఉమ్రి పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరు దైవచింతన కలిగి ఉండాలని, పర మత సహనం పాటించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామ నాయకులు సుబ్బరాయుడు, ముస్లింలు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న రామచంద్రయ్య

ఆస్పరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. మండలంలోని కైరుప్పల గ్రామంలో ఆదివారం సీపీఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ శరవన్న, కేశవయ్య సంస్మరణ సభ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ నాయకులు శరవన్న, కేశవయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. సీఎం, మంత్రులు ఆర్భాటం చేస్తున్నారే తప్పా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. నాయకులు నాగేంద్రయ్య, రాజాసాహెబ్, తిమ్మయ్య, విరుపాక్షి, కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, ఉరుకుందు, రవీంద్ర, వీరేష్, గోపాల్ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): రాజ్యసభలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి టి. కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్‌లో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చడంలో ఘెరంగా విఫలమైన మోదీ సర్కార్, ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా ప్రైవేట్ కంపెనీ చేతుల్లో పెట్టారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పూర్తిగా పక్కకు నెట్టి కులం, ప్రాంతం, మతం, భాష, భావం, దేవుడు, దేశభక్తి పేరుతో తిండిపైన, బట్టలపై ఆంక్షలు విధిస్తూ ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అమిత్ షా ఉద్దేశపూర్వకంగానే అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేషు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిలిపి కృష్ణ, వెంకటేశ్వర్లు, పట్టణ సహాయ కార్యదర్శి చిన్న మాదులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు సుధీర్‌నాయుడు, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని లక్కుంపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సుంకులమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు జరిపించారు. అమ్మవారిని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ దర్శించుకుని పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, రామచంద్రుడు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి


సత్యనారాయణ (ఫైల్)

మద్దికెర : మండల కేంద్రంలో సత్యనారాయణ (101) అనే శతాధిక వృద్ధుడు ఆదివారం రాత్రి మృతి చెందాడు. గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగించారు. వృద్ధాప్యం కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య సావిత్రమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. విషయం తెలుసుకున్న పలువురు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థినులకు స్కాలర్‌షిప్ మంజూరు

దేవనకొండ: మండలంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) ద్వారా ప్రగతి విద్యాజ్యోతి స్కాలర్‌షిప్‌లు మండలంలో ముగ్గురు విద్యార్థినులకు మంజూరైనట్లు మేనేజర్ రామకృష్ణ ఆదివారం తెలిపారు. ప్రతి సంవత్సరం గ్రామీణ బ్యాంకు ద్వారా 7- 9వ తరగతి వరకు చదివి అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ గ్రామీణ బాలికలకు ప్రగతి విద్యాజ్యోతి స్కీం పేరుతో ఏటా రూ.5 వేల చొప్పున అందజేస్తామన్నారు. ఈ యేడాది స్కాలర్‌షిప్‌లను దేవనకొండ కస్తూర్బా విద్యాలయానికి చెందిన విద్యార్థినులు షర్మిల, స్వప్న, గాయత్రీ బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేశామని చెప్పారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తా..ఇద్దరికి గాయాలు


మార్లమడికి సమీపంలో పొలంలో బోల్తా పడిన ట్రాక్టర్

హొళగుంద: బళ్లారి రోడ్డులోని మార్లమడికి గ్రామ సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మార్లమడికి గ్రామానికి చెందిన ట్రాక్టర్ పొలంలో పనులు ముగించుకుని గ్రామానికి వస్తుండగా కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనే పొలంలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ట్రాలీ పూర్తిగా పొలంలోకి ఒరిగిపోవడంతో అందులో కూర్చున్న గంగమ్మ, శ్రావణి అనే మహిళలకు మూగదెబ్బలు తగిలాయి. గ్రామస్తులు వారిని హొళగుంద పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు.


పొలాల్లో బోల్తా పడిన కారు

అదుపుతప్పి కారు బోల్తా

ఆలూరు రూరల్: మండలంలోని గోనేహాల్ బస్టాండ్ సమీపంలో ఆదివారం ఉదయం జాతీయ రహదారి-167పై అదుపు తప్పి కారు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు..కర్ణాటక రాష్ట్రం తుముకూరు నుంచి మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనానికి 11 మందితో వెళ్తున్న టవేరా కారు నంబర్ కేఏ 06 పీ 5859 అదుపు తప్పి రహదారి పక్కన పొలాల్లో బోల్తా పడింది. అయితే ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదని, 11 మంది సురక్షితంగా బయటపడినట్లు తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

దేవనకొండ: కర్నూలు నుంచి పత్తికొండకు వెళ్లే మార్గంలో కరివేముల వద్ద రోడ్డు కింద హంద్రీనీవా పిల్ల కాలువ ప్రవహిస్తోంది. గతంలో తెర్నెకల్, పాలకుర్తి గ్రామాల రైతులు హంద్రీనీవా పిల్ల కాలువ కోసం రోడ్డును తవ్వి రోడ్డు కింద పైపులైన్ ఏర్పాటు చేసుకున్నారు. కాలువకు నీరు ఎక్కువగా రావడంతో పైపు చుట్టూ ఉన్న మట్టి కోతకు గురై రోడ్డు రోడ్డు భారీగా కోతకు గురైంది. కర్నూలు-పత్తికొండ, కర్నూలు-బళ్లారికి నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తుంటాయి. ఎదురెదురుగా భారీ వాహనాలు వస్తే ప్రమాదం వాటిల్లే అవకాశముంది.


పత్తికొండ-కర్నూలుకు వెళ్లే రహదారి పక్కన ఏర్పడిన గుంత


రోడ్డు కింద ప్రవహిస్తున్న హంద్రీనీవా పిల్ల కాలువ


ఎల్లెల్సీ హొళగుంద సెక్షన్‌లో తగ్గిన నీటిమట్టం


కర్ణాటకలో వరినాట్లు వేస్తున్న దృశ్యం

ఎల్లెల్సీలో తగ్గిన నీటిమట్టం

- కర్ణాటకలో వరినాట్లు మొదలవడం, జలచౌర్యంతో తగ్గిన నీటి సరఫరా
- ఏపీలో మొదలు కాని రబీ సాగు

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో గత కొద్ది రోజులుగా నీటిమట్టం తగ్గింది. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఇన్నాళ్లు వరికోతలు జోరుగా సాగుతుండడంతో ఆంధ్ర, కర్ణాటకలో సాగునీరుకు డిమాండ్ తగ్గింది. అయితే ప్రస్తుతం కోతలు ముగియడం, రబీ సాగు మొదలవుతుండటంతో మళ్లీ నీటికి డిమాండ్ పెరిగింది. హొళగుంద సెక్షన్ 184 కి.మీ వద్ద దాదాపు 6 అడుగుల మేర ఉండాల్సిన నీరు నాలుగు అడుగుల వరకు మాత్రమే ఉన్నాయి.

కర్ణాటకలో జలచౌర్యం..

కర్ణాటక పరిధిలో ఇప్పటికే వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. దీంతో అక్కడ కాలువ నుంచి యథేచ్ఛగా జలచౌర్యం జరుగుతోంది. కాలువ అండర్ టన్నల్‌కు, కల్వర్టులకు భారీ రంధ్రాలు వేసి వంకలు, వాగులకు సాగు నారును మళ్లించుకుంటున్నారు. కిలో మీటర్ల పొడవునా పైప్‌లైన్ చేసుకుని సాగునీరును అక్రమంగా తీసుకెళ్తున్నా అడిగే నాథుడే కరువయ్యారు. ఫలితంగా ఆంధ్ర రైతులకు సాగు నీరుకు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఆక్కడి రైతులు రబీ కింద డిసెంబర్ నెలలోనే వరినాట్లు వేసుకుంటే ఇక్కడ జనవరి నెల నుంచి మొదలవనున్నాయి. డ్యాంలో 1,669 క్యూసెక్కుల నీరును ఎల్లెల్సీకి వదులుతుంటే ఆ నీరు ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 342 క్యూసెక్కులు మాత్రమే ప్రవహిస్తున్నాయి. ఇక్కడ 660 క్యూసెక్కుల నీరు సరఫర జరగాల్సి ఉండగా.. నీటికి డిమాండ్ పెరగడం, కర్ణాటకలో జలచౌర్యం కారణంగా 342 క్యూసెక్కులకు పడిపోయింది. ప్రస్తుతం టీబీ డ్యాంలో 105.788 టీఎంసీలకు గాను 87 టీఎంసీల నీరు నిల్వ ఉంది.